
# పాలువిరిగి పోయాయి!

గొల్లపూడి మారుతీరావు



"నాకు పెళ్ళి వద్దు బాబూ" అనే ఫేషన్ అలవాటు చేసుకుంది సుశీల.

అలా అన్నప్పుడు సర్వసంగ పరిత్యాగం చేసి విరక్తురాలైన ఋషిలాగ ముఖం పెట్టడం. ఈ పెళ్ళి అనే సాంఘిక దురన్యాయం మీద వెర్రి కోపం వైరాగ్యాన్ని. కళ్ళ చికిలి: తల ప్రదర్శించటం సుశీల అలవాటు చేసుకొంది.

గుర్రప్పందాలలో గెలవాలని తాపత్రయ పడి చివరికి లక్ష రూపాయలు గెలిచిన ఆపూరం క్షణంలో "అం పోనిద్దూ - డబ్బంటే వ్యామోహం ఏనాడో వచ్చిపోయింది" అని విరక్తిన్ని చూపే వాడిని చూస్తే ఎంత జాలేస్తుంది? అదిగో అలా మనస్సు కరిగిపోతుంది సుశీల అన్న మాటని వింటున్నప్పుడు.

ఎ చాతనంటే - పుట్టలు మరిచిపోయి కొండల్లో తవ్వాడుతున్న త్రాచుల్లాగ భుజాల మీంచి ముందుకుజారి రెపరెపలాడే రెండు జడల్నీ, ఆక్రోశం వెనక ఆహారం కోసం అటూ ఇటూ వెదుక్కొనే చేపల్లాగ గిలగిల్లాడే కళ్ళనీ చిరునవ్వుకీ తిరస్కారానికీ మధ్య సందేహపు రేఖ మీద నిలిచిపోయిన ఎర్రటి పెదాల్నీ. సినిమాల్లో నాటకాల్లో కనిపించే త్యాగంలాగ ఉందా లేదా అనిపించే నడుమునీ. పాత జవానీకి రైలు వంటి నడుంమీద ఆధారపడిన ఆ శరీరాన్ని చూసినప్పుడు ఇంత అందమయిన అమ్మాయి యింత త్వరగా "పెళ్లి వద్దు" అనే కఠోర నిర్ణయానికి ఎలా వచ్చిందా అని కొంత దిగులు కలుగుతుంది.

అయితే "నాకు పెళ్ళే వద్దు బాబూ" అనే ఫేషన్నే అలవాటు చేసుకొంది సుశీల. అంతే కాని ఆ ఆలోచననీ. ఆ భావాన్నీ అమలు జరపడం. అసలు ఉద్దేశం కాదు.

ఎందుకంటే "వొద్దు అనే తిరస్కారంలో "కావాలి" అనే ఆకాంక్ష ఎక్కువగా ప్రతి ఫలిస్తుందని ఆమె అనుభవం ద్వారా గ్రహించింది. లోకంలో "వద్దు" అనేవాళ్లంతా "కావాలి" అనే దృష్టితోనే అంటున్నారనీ, సూటిగా చెప్పడానికి వయస్సో. వాతావరణమో సంస్కారమో. మొహమాటమో అడ్డొస్తున్నదనీ. ఆమె కని పెట్టింది. నలుగురూ ఎబ్బెట్టుగానో. సలక్షణంగానో చూసేదాన్ని నలుగురిలో కావాలని చెప్పడానికి సంస్కారి నేర్చుకున్న పదమే ఈ వద్దు అని ఆమె అర్థం చేసుకొన్నది.

సుశీల బామ్మ ఎప్పుడూ విరక్తిగా "నా కెందుకమ్మా — పట్టెడు ఉప్పుపిండి అయితే రాత్రి గడిచి పోతుంది. నా కింకేమీ వొద్దు" అనడం వింది. ఆ రాత్రులు గడవడానికి దస్తా గిన్నెడు ఉప్పుపిండి ఫలహారం చెయ్యడమూ చూసింది.

"శనివారాలు భగవత్ప్రీతికి ఉపవాసం ఉండాలమ్మా. అందుకని రాత్రి భోజనం వద్దు ఓరొట్టె ముక్క కోరికి దేవుడికి నమస్కారము చేసాను. అని తల్లి రుక్మిణమ్మ పక్కింటి వాళ్లతో అనడం చాలా సార్లు వింది. కాని అరడజనుకి తక్కువ కాకుండా, డజనుకి మించకుండా రొట్టెలు ఫలహారం చేస్తేనేకాని ఆ శనివారాలు గడవని సంద్రాలెన్నో. తెలుసు సుశీలకి.

"బ్రతికి నన్నాళ్లూ సజావుగా బ్రతకాలి. అంతేకాని లాలూచీలు చిన్నబుద్ధులూ మనికి వొద్దు" అని పెద్దతరహాగా తండ్రి గోవిందరావుగారు యింటికి వచ్చే క్లయింట్లతో తరచు అనడం వింది. అలా అన్నపుడు ఆయన ముఖంలో మోతీలాల్ నెహరూ. రైట్ ఆనరబుల్ శ్రీనివాస శాస్త్రి ప్రభృతుల ముఖాల్లోని త్యాగనిరతి వెలగడం ఆమె చూచింది. కాని ఆయన ఏ క్లయింటు పంపిన అరటి గెలలూ కాదనలేదు. చెరుకు గడలూ. మామిడిపండ్లు ఇస్త్రీపెట్టెలూ. కొండొకచో వడ్లబస్తాలూ సరేసరి - అయితే అవన్నీ మామూళ్ళు

క్లాసులో ముక్కు మాష్టరు తనవేపే చూస్తుండడాన్ని. రాధ స్నేహితురాళ్లందరి దృష్టికి తెచ్చి "అబ్బ! అలా పొడిచేసేటట్టు నావేపే చూస్తుంటే వొంటిమీద తేళ్లూ జెర్రులూ పాకినట్టుంటుంది బాబూ నాకి పాఠమూ వొద్దు ఈ క్లాసూ వద్దు అంటూండడం నిజమేనని నమ్మింది సుశీల. కాని ముక్కు మాష్టారూ రాధా ఓ సాయంకాలం లీలా మహల్లో కనిపించాక-ఆ వద్దు అని చెప్పడంలో స్వారస్యం అర్థమయింది. అంత అందంగా తన కోరికను క్యామొఫాగ్ చేయగలిగినందుకు రాధని మనస్సులో అభినందించింది.



ఆ తర్వాత హిస్టరీ లెక్చరర్ రామనాథం అంటే తనకు సుతరామూ కిట్టదని. బేథింగ్ సీన్లు ఉన్న సినిమాలంటే తనకి యిష్టంలేదనీ, బారుల్లో బాల్‌రూం డాన్సులు ఎందుకు చేస్తారో తనకి అర్థంకాదనీ - నలుగురితోనూ వీలయినప్పుడల్లా అనడం ప్రారంభించింది. ఇదిగో ఈ సందర్భాల్లో ఆమెచేసిన ప్రకటనే "నాకు పెళ్ళేవద్దు బాబూ" అన్నది

నిజానికి సుశీలకి ఒకటి రెండు పెళ్ళి సంబంధాలు వచ్చాయి స్థితిగతులూ, ఆస్థిపాస్తుల్లూ ఉన్న సంబంధాలే అవి. కానయితే వాళ్ళు సుశీలను గురించి వాకబు చేసినప్పుడు "ఆమె ధోరణి కర్ణాకర్ణిగా విన వాళ్ళు "అదేమిటి! - ఆ అమ్మాయి పెళ్లివద్దు మొర్రో అంటూంటే మీరు చేసుకొంటా నంటారేమిటి?" అని విస్తుపోవడంతో పెళ్లివారూ విభ్రాంతులు కావడం "అంత చేసుకోననడానికి ఆ అమ్మాయికి ఏం అభ్యంతరాలో - అవన్నీ తల్లిదండ్రులకి తెలియాలని మాత్రం ఏముంది?" అని ఆ ప్రయత్నాలు అంతటితో మానుకొన్నారు. ఈ విషయం సుశీలకు తెలీదు, వాళ్ళ నాన్నగారికీ తెలీదు,

ఓ సారి ఓ అందమయిన కుర్రాణ్ణి పెళ్లి చూపులకి తీసుకొచ్చారు నాన్నగారు. పేరు కృష్ణారావు. కుర్రాడు పొట్టిగా, నిండుగా బాగున్నాడు. బుగ్గలు ఉబ్బినట్టుండి. లోపల పెద్దసైజు కిళ్ళీలు పెట్టినట్టుంటాయి. ముభావంగా ఉన్నప్పుడు నవ్వినట్టు. నవ్వినప్పుడు ముభావంగా ఉన్నట్టూ కనిపిస్తాడు. అయినా తీవిగానే వున్నాడు. తీవిగా. ముభావంగా వున్న వాళ్ళంటే సుశీలకిసరదా వాళ్ళ హిస్టరీ మాస్టరు అలాగే ఉంటాడు కనక అందుకని. ఈకుర్రాణ్ణి చేసుకోవాలనే అనిపించింది. పెళ్లి పెద్దలు ఎవి గట్టుకొని సూటిగా "చెట్టు లెక్కగలవా? పుట్ట లెక్కగలవా? అని ప్రశ్నలు వేస్తూంటే టయ్యో మూడోసారి పరీక్ష వ్రాసినప్పటంత శ్రద్ధగా జవాబులు చెప్పింది. తీవిగా వున్న పెళ్లికొడుకు ముఖం ముభావంగా అయింది అంటే అతను చిరునవ్వు నవ్వుతున్నాడని అర్థం చేసుకొంది,

పెళ్లి వారు వెళ్లిపోయాక అమ్మ. నాన్నగారూ. బామ్మ ఓ చిన్న సమావేశం జరిపారు. పెళ్లి పెద్దల కివ్వగా మిగిలిన ఉప్మా అంతా తిని కాఫీలు త్రాగి చీకటి పడేవరకూ చర్చలు జరిపారు, జరిపి జరిపి ఆహార సమస్యా నివారణకు సత్వర చర్యలను విచారించిన ముఖ్య మంత్రుల సమావేశంలాగ ఎక్కడి వాళ్ళక్కడ చెదిరి పోయారు.

రాత్రి వెన్నెల్లో పడుకొని పొటిగా, తీవిగా ఉన్న పెళ్లికొడుకును గురించీ. భవిష్యత్తులో ఎప్పుడన్నా ఏమండీ సినిమాకు వెళ్దామండీ" అంటే తీసుకు వెళ్తాడా లేదా అన్న సమస్యను గురించీ ఆలోచిస్తూ పడుకొని వుండగా - అమ్మ మంచం దగ్గరికివచ్చి కూర్చుని "అవునే బుచ్చీ! అబ్బాయి ఎలా వున్నాడే? - సిగ్గు పడకుండా చెప్పు" అంది తనింకా సిగ్గుపడక ముందే.

అప్పుడింక వెన్నెల్లోనే సిగ్గుతో వెయ్యి వంకర్లు పోయి. అటునుంచి యిటుతిరిగి "అబ్బ! నాకు పెళ్లేమిటమ్మా! అంది తల్లి ఒడిలో తల దాచుకొంటూ. కుటుంబంలోని ఆనవాయితీ ప్రకారం నాకు వద్దాడని చెప్పడానికి యిదే పద్ధతనుకొంది సుశీల.

కాని "పాపం! పిచ్చిది - ఈ సారీ అబ్బాయి నచ్చలేదు కాబోలు. నచ్చక పోవడానికి దాని కేం కారణాలు కనిపించాయో" అని తల్లి రుక్మిణమ్మ అనుకొంది.

ఏమయినా కూతురుకి యిష్టంలేని పని చెయ్యదలచుకోలేదు పెద్దవాళ్లు అందుకని ఆ సంబంధము పోయింది. ఎందుకు పోయిందో తెలుసుకొనే ధైర్యము కాని, అది పోకుండా ఉండడానికి ఏం చెయ్యాలనే ఆలోచనగాని చెయ్యలేక పోయింది సుశీల.

నెల రోజుల తర్వాత రాధ సలంబా రూఫ్ గార్డెన్ హోటల్లో కనిపించి "అవునోయ్-బిత్తల బుచ్చిసుందరరావుగారి అబ్బాయి సంబంధాన్ని నువ్వే కాదన్నావట!" అని అడిగి నప్పుడు సుశీల తెల్లబోయింది. బుచ్చిసుందరరావుగారి అబ్బాయి ఆరోజు తీవిగా, ముభావంగానున్న కృష్ణారావే

నని తెల్చుకొన్నాక - "నేను వనద్దలేదే" అని ఆశ్చర్యపోయింది సుశీల

"ఏమోనోయ్ - నాకు ఖాయంచేశారు మా వాళ్ళు. వద్దనడం లాంటి పనులు నా కిష్టం వుండదు" అని రాధ నవ్వేసింది. తర్వాత ఆ మాట ఈ మాటా మాట్లాడుతూ "ఏం? నీకు పెళ్ళిచేసుకోవాలని లేదా?" అనడిగింది.

"ఆఁ నాకు పెళ్ళే వద్దు బాబూ!" అంది సుశీల తీవిగా, ముభావంగా.

ఆ మాటల్లో "ఆఁ: పెళ్ళెవరి కక్కర్లేదు!" అనే ఆశ, 'కావాలి' అనే కోరికా కనిపించాయి

•

"పెళ్ళా? అమ్మో - వద్దుబాబూ!" అనడం ఫేషన్‌గా అలవాటు చేసుకొంది సుశీల. మూడేళ్ళ తర్వాత—

పెళ్ళన్నది ఓచీకటికోణం అయినట్టూ దానికి తలవొంచడం - దీపం లేకుండా ఆ చీకటిలోకి వెళ్ళడమన్నట్టూ గతుక్కుమనేది.

ఈ మధ్యలో ఒకటి రెండు సంబంధాలు రావడం. అవి మధ్యలోనే జారిపోతూ ఉండటం జరిగిపోయాయి ఆలా జరిగినప్పుడల్లా సుశీల బామ్మ నోరు చప్పరించి - "అఁ! సంతంటి పిల్లకి పెళ్లి జరక్కపోతుందా? ఈ సంబంధం కాకపోతే మరొకటి! ఇంతకీ దాని కెక్కడ రాసిపెట్టి వుందో అక్కడే అవుతుంది. ఆ మొగుడెవరో ఎక్కడో పుట్టే ఉంటాడు" - అంటూండేది.

ఈ ఫిలాసఫీ ఎంతో నచ్చింది సుశీలకి. ఆ రాసి పెట్టి ఉన్నవాడు - గోపాలరావనే చిన్నవాడు - 'పోరంకి' వెళుతున్న బస్సులో సంవత్సరం క్రితమే తటస్థపడాడని, అతనితో నాలుగు సార్లు కృష్ణాబారేజికి. పదిసార్లు సినిమాకి ప్రతీ రోజూ సాయంకాలం హోటళ్ళకి వెళుతున్నామని వాళ్ళకి తెలీదుకదా అని సుశీల వాళ్ల అజ్ఞానానికి మనస్సులో జాలిపడింది.

ఎదుటి వాళ్ళకి తెలియని విషయం మనకి తెలియడంలో ఎంత గర్వం వుందో ఇన్నాళ్లకి గ్రహించింది. కాని గోపాలరావు కూడా అదే గర్వాన్ని - సుశీలని ప్రేమించకుండా ప్రేమిస్తున్నానని భ్రమింప చేస్తున్నాడనే గర్వాన్ని - సంవత్సరం నుంచీ అనుభవిస్తున్నాడని సుశీలకు తెలియలేదు.

అయితే వాళ్ళిద్దరూ చాలా సాయంకాలాలు సినిమా డైలాగులు మాట్లాడుకొన్నారు. ఈ గ్రుడ్డి సంఘం తమని యింకా గుర్తించే రోజు రాలేదని యిద్దరూ కూడబలుకొన్నారు.

"నన్ను ఎంతగా ప్రేమిస్తున్నావు గోపీ!" అని అతని ఊపిరి బుగ్గలకి తగిలేటంత దగ్గరగా ఉన్న సందర్భాలలో సుశీల అడిగితే—

మాటల మధ్య గాలిని వదుల్తూ "నేను మాటల్లో చెప్పలేను సుశీ - ఈ ఆకాశం, ఎండలూ, మ్రిచెట్లూ మరకతవల్లీనర్సింగ్‌హోమ్ సాక్షిగా నిన్ను ప్రేమిస్తున్నాను"—అని గోపాల్రావు అనేవాడు—ఆ క్షణంలో అతని దృష్టికి అనిన వస్తు సంపదని డైలాగుల్లో చేరుస్తూ.



"వర్షాగమనం"

ప్రేమించుకున్న వాళ్ళు లాంఛనంగా ఒక రిక్షాలో వెళ్ళాలని తెలిసి వాళ్లిద్దరూ సినిమానించి చాలా సార్లు అలా చేశారు. అప్పుడు సుశీలకి తెలిసినవాళ్ళు కూడా చూడటం జరిగింది. సుశీల తన ఫోటో ఒకటి అతని కిచ్చింది. గోపాలీ పుట్‌బాల్ చాంపియన్‌గా జనీనుతో తీయించుకున్న ఫోటో ఆమెకి బహూకరించాడు. ఇలా వాళ్ళ ప్రేమ మూడు పువ్వులూ ఆరు కాయలూ అయింది.

ఈ కారణంగా - సుశీల బామ్మ "వాడెక్కడో పుట్టే వుంటాడు" అన్నప్పుడల్లా—

"ఎక్కడోకాదు బామ్మా. విజయవాడ సమీపాన వందలప్పరు గ్రామంలో పుట్టి - యిప్పుడు సూర్యారావుపేటలో నే పెరుగుతున్నాడు"— అని చెప్పాలని నోటి వరకువచ్చి అంతలో ఆగిపోయేది.

ఈ కారణంగానే వచ్చిన ఒకటి రెండుసంబంధాలపైనా సుశీల అభిప్రాయాన్ని రుక్మిణమ్మ అడిగినప్పుడు "పెళ్ళా? అమ్మో - నాకు వద్దు బాబూ!" అని సమాధానం చెప్పింది - లైటు లేని రిక్షావాలా పోలీస్ స్టేషన్‌ముందు నుంచి వెళ్ళడానికి భయపడినట్టు.

ఇలా వుండగా కాలేజీ పరీక్షలయిపోయాయి. శలవు లిచ్చారు. పరీక్షలయిన కుర్రాళ్ళంతా ఇళ్లకి వెళ్ళిపోవాలి గనుక. గోపాలరావూ ఊరికి బయలుదేరాడు. దిగులు కళ్ళతో. బరువెక్కిన హృదయంతో వీడ్కోలు యిచ్చింది సుశీల, తన దుఃఖాన్ని బహిరంగంగా అనుభవించే అవకాశాన్ని ఈ సంఘం కల్పించనందుకు సంఘాన్ని నిందించి. మూగ బాధని అనుభవిస్తూ కొన్ని రాత్రులు భోజనం చెయ్యడం మానేసింది.

కాని ఎన్నాళ్ళయినా గోపాలరావు దగ్గర్నుంచి ఉత్తరంలేదు. వచ్చే జాడలేదు. తల్లి దండ్రుల్ని ఒప్పించి పెళ్లి చేసుకొంటానన్న మాట కూడా సుశీలతోపాటు విజయవాడలోనే వదిలేసి గోపాలరావు రైలెక్కిపోయాడు

ఒక శుభ సమయాన పసుపు రాసిన దళాసరి కవరుని పోస్టు బంట్రోతు నడవలోకి గిరవాటెట్టి వెళ్లిపోయాడు. తీసి చదువుకొంది సుశీల - గోపాలరావుకీ చిరంజీవి సౌభాగ్యవతి వెంకుమాంబకి పెళ్లనీ. వెంకుమాంబ ఎవరని కాదు గానీ. తను కానందుకు దుఃఖం ముంచుకు రాగా మరికొన్ని రాత్రులూ పవళ్లూ. రహస్యంగా ఏడ్చింది సుశీల

ఆలోచనలూ. దుఃఖమూ పాతబడాక అప్పుడప్పుడు వారపత్రికలూ. అవీ చదవడం అలవాటు చేసుకొంది. సాయంకాలాలు అలా షికారుగా నడిచివచ్చేది.

"వాడెక్కడో పుట్టే వుంటాడు" అనే బామ్మ మాటల్ని అసక్తితో వినేది

ఒకరోజున సినిమానుంచి వస్తూండగా రాధ భర్తతో ఎదురయి పలకరించింది సన్నంగా పొడుగ్గా ఉండే రాధ బొద్దుగా అందంగా తయారయింది. ఆ మాటా ఈ మాటా అయ్యాక "అయితే ఏమోయ్! నీ పెళ్లిమాటేం చేశావ్?" అంది రాధ మాట మధ్యలో.

సుశీల నవ్వి "పెళ్లా! - అమ్మో - నాకు వద్దు బాబూ" అంది

ఆ మాటలో "త్వరగా జరుగుతుందంటావా?" అనే ప్రశ్న. "జరిగితే బాగుణ్ణు" అన్న ఆతృతా వినిపించింది.

* * *

"నా పెళ్ళా! - సరేలే—" అనడం ఫేషన్‌గా చేసుకొంది సుశీల— ఈ రెండేళ్లయి.

ఈ రెండేళ్ళలో తన కోరికలకి రూపం యివ్వగల ఇదరు సన్నిహితులూ పోయారు - బామ్మ. అమ్మ. ఒకావిడ వయస్సు మీరడం వల్లా మరొకావిడ మనస్సు మారకం వల్లా పోయారు. రుక్మిణమ్మగారు గుండె జబ్బువల్ల పోయిందని డాక్టర్లు తేల్చారు. సుశీల పెళ్లి గురించి బెంగవల్లనని బామ్మ బ్రతికుంటే చెప్పేది. కాని ఆవిడ ముందే పోయింది. తను ప్రేమించిన గోపాలం దూరం కావడంతోనే బాధ పడుతున్న సుశీలకి, తనని ప్రేమించే బామ్మ, బామ్మ పోవడం కొత్తగా కనిపించింది. ప్రేమ. అందం, ఆనందం ఒంటరితనంలో చచ్చిపోతాయి. ఆనందం యిద్దరి ఆలోచనల మధ్య వికసిస్తుంది అందం ఎదుటి వ్యక్తి హస్తంలో ప్రస్ఫుటమవుతుంది. మరి ప్రేమా అంతే—

వెన్నెట్లో పడుకొన్నప్పుడు దాని అందం తెలీదు. వెన్నెలలేని రాత్రి చీకటి ఆకాశం క్రింద పడుకొన్నప్పుడు వెన్నెల రాత్రి అనందం అనుభవమవుతుంది. తల నిమిరి ఆనందంగా పలకరించే అమ్మ గొంతులో తియ్యదనం. "వాడెక్కడో పుట్టే వుంటాడు" అని తన ఒంటరితనాన్ని మరిపించే బామ్మ బుజ్జగింపూ ఇప్పుడర్థమయ్యాయి. కాని యిప్పుడవి కరువయ్యాయి. సుశీల పెళ్లి కావాలని ఆ యింట్లో కతా పోరి. ప్రతిరోజూ గుర్తుచేసే వాళ్లిద్దరూ కన్నుమూశారు. ఈ నష్టాన్ని నలభై ఏళ్ల తండ్రి భర్తీ చెయ్యలేదు పన్నెండేళ్ల చెల్లెలు కాంత అంతకన్నా భర్తీ చెయ్యలేదు. ఎగిరే బెలూను గాలిలో తాప్పున పేలితే నవ్వాలని. గాలి కరీరాన్ని కరుచుకొని గిలిగింతలు పెడితే అందంగా వుంటుందనీ. హోటల్లో అందరూ చూస్తూండగా కాఫీ త్రాగడం ఫేషన్ అనీ కాంతకి యిప్పుడిప్పుడే అర్థమవుతోంది. కాంత ఆలోచనలు యిప్పుడిప్పుడే ఆశలవుతున్నాయి. సుశీల ఆశలు అప్పుడే ఆశయాలయాయి



ఎప్పుడూ చూడని దూరపు బంధువులు యిప్పుడు తరుచూ వచ్చిపోతున్నారు. ఎవరో విధవావిడ- ఓ ఉదయం వచ్చి పిల్లలిద్దర్నీ దగ్గరికి తీసుకొని "ఈ పిల్లల్ని పెట్టకొని ఒక్కడివీ ఎలా బ్రతుకుతున్నావు అన్నయ్యా!" అని రాగం పెట్టింది. ఇన్నాళ్ళూ మాత్రం ఎలా బ్రతికారో ఈవిడకి తెలుసా అని సుశీల ఆశ్చర్యపోయింది ఈవిడకి ఎప్పుడు తను అన్నయ్య అయాడో తెలీక గోవిందరావుగారూ కాసేపు నిర్ఘాంతపోయారు. అయితే కష్టకాలంలో మంచి మాట చెప్పే వాళ్ళంతా బంధువులుగానే కనిపిస్తారు. ఆ రహస్యాన్ని కనిపెట్టే బంధువులు కాని వాళ్ళు తా మంచిమాటలు చెప్పి ఆక్షణం నుంచీ బంధువులయి పోయారు.

ఇప్పుడు వంటమనిషి పని మానేసింది. విధవావిడే వంటచేస్తోంది. ఆవిడ పింతల్లి కొడుకూ. తమ్ముడి పిల్లలిద్దరూ ఆ యింట్లో చేరిపోయారు. ఆరునెలలయేసరికి ఇల్లు రైల్వే ప్లాటు ఫారంలా తయారయింది.

ఓరోజు సుశీల స్టిచింగ్ క్లాసునుంచి ఇంటికి వచ్చేసరికి ఎవరో పెళ్లివారు యింట్లోకి వచ్చి కూచున్నారు. వాళ్లో పెళ్లి సంబంధానికి వచ్చారని చూడగానే గ్రహించింది. ఈసారి పెళ్లికొడుకు ఎలాంటి వాడయినా తప్పక ఒప్పుకోవాలనుకొంది. ఈసారి "అబ్బ పెళ్ళేమిటి లెద్దూ!" అనకూడదు. చిరునవ్వు నవ్వి తలాడించాలి.

పెళ్లివారు వెళ్లిపోయారు. వాళ్లెవ్వరో. ఎక్కణ్ణుంచి వచ్చారో బామ్మ బ్రతికుంటే చెప్పేది ఎప్పుడూ నాన్నగారిని యిలాంటివి అడిగే అలవాటులేదు. వాళ్ళు ఎప్పుడో వస్తారని. వచ్చినప్పుడు వరుడూ తనని చూడడానికి వస్తాడని రోజూ ముస్తాబయి - ఆశగా చూసేది.

ఒక రోజు పెళ్లివారు వచ్చారు. వాళ్ళందరిలోనూ పెళ్లికొడుకు ఎక్కడా అని వెదికింది కాని అంతా నలభై పై బడినవాళ్ళే. నిర్ఘాంతపోయింది, కాంతని రహస్యంగా పిలిచి "ఎవరే వాళ్ళు.?" అంది.

"పెళ్ళి వారక్కా - చూపులకి వచ్చారు"

"ఎవరి పెళ్లి!"

"ఇంకెవరికి? నాన్నగారికి" అదేదో సామాన్యమయిన. విషయంలాగ - ఎలకల విషంవేస్తే ఎలకలు చావకేం చేస్తాయి! అన్నంత సామాన్యంగా చెప్పేసి వెళ్లిపోయింది కాంత.

తిమ్మరపోయింది సుశీల. పెళ్ళి నాన్నగారికా! అందుకా యిన్నాళ్ళు రాకపోకలు!

పాపం! సుశీల పెళ్ళిని గురించి ఆలోచించింది కాని. చేసుకోవాలనే మనుషుల గురించి ఆలోచించలేదు మామిడిపండు తియ్యగా వుంటుందని తెలుసుకొని. దానికి కారణమయిన మామిడి చెట్టు సంగతి తెలీదు.

హఠాత్తుగా పెళ్ళి సమస్య సుశీల మీదనుంచి గోవిందరావుగారి మీదకి బదిలీ అయిపోయింది. ఇప్పుడెవరూ "ఆ అమ్మాయికి పెళ్ళి కాలేదేం!" అనుకోవడం లేదు. కాని అందరూ గోవిందరావుగారికి యింకా పెళ్ళి కానందుకు తెగ బాధపడిపోతున్నారు. సుశీల పెళ్ళికి వయస్సు మించిపోతోందని ఎవరూ అనడంలేదు. కాని నాన్నగారికి వయస్సుకి పెళ్ళిమించి పోతోందని ఆరాటపడుతున్నారు. పెళ్ళికావలసిన సుశీల ఆ విషయం మరిచి పోయింది. కాని పెళ్ళి చెయ్యవలసిన తండ్రి కూతురు పెళ్ళి విషయం మరిచి పోయి తన పెళ్ళిని గురించి ఆలోచిస్తున్నాడు. ఓ శుభ ముహూర్తాన "అం- నాకు పెళ్ళేమిటిలే - అదులోనూ ఈ వయస్సులో -" అంటూనే ఆయన పీట లెక్కాడు.

పెళ్ళి నాలుగు రోజులూ ముచ్చటగా జరిగింది. వధూవరులచేత బంతులాట లాడించారు. పదస్య సంభావనలు ఒకటికి రెండింత లిచ్చారు.

పెళ్ళికి వచ్చిన ముత్తయిదువలలో ఒకావిడ హఠాత్తుగా జ్ఞాపకం వచ్చినట్టు - సుశీల వేపు దిరిగి "అవునే అమ్మడూ!. మరి నీ పెళ్ళెప్పుడూ" అంది.

సుశీల నవ్వేస్తూ "నా పెళ్లా!. సరేలే. అత్తయ్యా" అంది.

"నా పెళ్ళా?- ఇప్పటికయినా జరిగితే అదృష్టవంతురాలినే" అన్న పిచ్చి ఆశ. "జరుగుతుందా" అన్న బలహీనపు అనుమానం ఆ మాటల్లో ప్రతిఫలించింది.

* * *

"అం. నా పెళ్లికేం పోనిస్తూ"- అనడం తప్పనిసరిగా- యిష్టం లేకపోయినా- యిప్పుడు ఫేషన్ చేసుకొంది సుశీల.

"అలా అనడం నాకో ఫేషన్ అయిపోయింది" అని యివాళ- అంటే ఈ ముప్పయి రెండోయేట- మరో వాక్యం కూడా చేరుస్తుంది సుశీల.

ఇప్పుడు సుశీల పాలసప్లయి ఆఫీసులో రెండు వందల రూపాయల గుమాస్తా. ఎప్పుడయినా పాలు విరిగిపోతే, ఎందుకువిరిగిపోయాయో విరిగిపోయిన పాలు ఏం చేస్తున్నారో తనిఖీ చేసే ఉద్యోగం సుశీలది. తనకా ఉద్యోగం సరిపోతుందని ఎంప్లాయ్‌మెంట్ ఆఫిసరే అన్నాడు. "అవును సార్- విరిగి పోయిన జీవితం నాది. కరిగిపోయిన యౌవనం ఏమవుతుందో నాకు తెలుసు. విరిగిపోయినపాలు రసగుల్లాలవుతాయి,

తెల్లమచ్చలకు
ఉచితవైద్యము

శక్తివంతమైన మా ఆయుర్వేద ఔషధము "Swetari" తెల మచ్చలను కొద్ది రోజులలో తొలగించును. సాంఘిక సంక్షేమం కొరకు 1000 రోగులకు ఒక్కొక్క పాకెట్ ఉచితంగా ఇవ్వబడును. వెంటనేవ్రాయండి.

Sri Krishna Chandra Vaidya
(A.G.)P O. Katrisarai (Gaya)

తిరిగిపోయిన యౌవ్వనం ఏమీకాదు" -అని మనస్సులో అనుకొంది. అనుకొని నవ్వుకొంది.

గోవిందరావుగారి కిప్పుడు ప్రాక్టీసు తగ్గింది. "అయినా నాకున్న ప్రాక్టీస్ నాకు చాలు. నాకు లేనిదీ, సాధ్యం కానిదీ నాకు వద్దు" అనడం నేర్చుకున్నారాయన- అనవాయితీగా. కాని సాధ్యం కాకపోవడానికి కారణం- యిప్పుడు ఆయన దృష్టి 24 గంటలూ యింటిమీదే ఉండటం, ప్రాక్టీసు లేకపోవడానికి కారణం పార్టీలు రాకపోవడం. పెళ్ళాం పోయినప్పుడు గోవిందరావుగారి ఒంటరితనానికి సానుభూతి చూపిన పార్టీలు. ఆయన రెండో పెళ్లికి హర్షించలేక పోయారు, 'ఇంట్లో చెట్టంత పిల్లని పెళ్లికి వుంచుకొని తాను పెళ్లిచేసుకుని కులుకుతున్నాడు" అన్నారు. అలా తాము చేయలేని ముసిలి క్లయింటులు కొందరు కొత్త ప్లీడర్ల దగ్గరికి పోయారు.

సుశీలకి గోవిందరావుగారు ఆ మధ్య కొన్ని సంబంధాలు వెదికారు. కాని ఒక్కటీ కలిసిరాలేదు. దానికి కారణాలు వేరే చెప్పనవసరంలేదు. యిప్పటికి ఏరోజైనా పెళ్ళవుతుందని, తాము సుఖపడవచ్చనని సుశీల అనుకోవడంలేదు. "వాడెక్కడో పుట్టేవుంటా"డన్న బామ్మ మాటలూ గుర్తు చేసుకోవడం లేదు.

కొత్తగా వచ్చిన యజమానురాలు సుశీలకన్న రెండేళ్లు పెద్ద అవిడ. పేరు అలివేలు. పెద్ద యింటి కోడలవడం చేత, పెద్దవాడిని కట్టుకోవడం చేత అవిడకి పెద్ద బుద్ధులు సహజంగా వచ్చేశాయి. తనంత వున్న పిల్లల్ని అసహ్యించుకోవడం - కనీసం అలా కనిపించడం మంచిది కాదనీ, అది తనకే శ్రేయస్కరం కాదనీ, ఆమె వచ్చిన నెలరోజుల్లోనే గ్రహించింది. అందువల్ల సుశీల, కాంత అంటే రెండుకళ్ళలాగ చూసుకోవడం ప్రారంభించింది. కాఫీ యిచ్చే వేళలో హార్లిక్స్ ఇచ్చింది, హార్లిక్స్ యిచ్చే వేళలో పళ్ళరసం ఇచ్చింది. తత్ఫలితంగా యింటి ఖర్చులు పెరిగితే పెరిగాయి కాని- అందరి అభిమానమూ ఆమెకి దక్కాయి.

ఆమెకూడా కుటుంబ సంప్రదాయం ప్రకారం —"నాకే ముందమ్మా బీద కుటుంబం నుంచి వచ్చేను, మీ మధ్యవుంటూ రోజులు గడుపుకొని ఆయన ముందే సుమంగళిగా వెళ్లిపోతాను. నాకేమీ వద్దు" — అని చెప్పడం అలవాటు చేసుకొంది.

ఆమె ఆ యింటి భవిష్యత్తుని అతిసుళువుగా బేరీజు వేసింది. సుశీలకు పెళ్ళీడు ఎలాగూ దాటిపోయింది, కాంత పెళ్లికి వచ్చింది, ఇక సుశీల పెళ్ళి ప్రసక్తిలేదు. అందుకని కాంతపెళ్లి జరిగిపోతే, తనకిపుట్టే పిల్లలకి యిక తిరుగువుండదు. ఆయన ప్రాక్టీసు తగ్గినా, సుశీల ఆర్జన వేన్నీళ్లకి చన్నీళ్లలాగ కలిసి వచ్చింది. అందువల్ల దీప ముండగానే ఇల్లు చక్కపెట్టుకోవాలి,

అందుకని— "కాంతకి సంబంధం చూడండి" - అని భర్తతో పోరసాగింది అలివేలు. గోవిందరావుగారు ఎంతో సంతోషించారు. అనుకూలవతి అయిన భార్య, తనపిల్లల్ని అభిమానించే తల్లి దొరికినందుకు. "మరి సుశీల పెళ్లి మాటేమిటి?" అని ఆయన అడగాలేదు, ఆయన అడుగుతాడని ఆమె అనుకోనూ లేదు. అడగడానికేముందనలు?- ఉదయించిన సూర్యుడు ముఖం కాల్చుకొని అస్తమించక ఏం చేస్తాడు? — అస్తమిస్తాడు చూడండని వేరే చెప్పాలా?

ఆ విధంగా సుశీలపెళ్లి ఆమె జీవితంలోంచీ, వాళ్ల ఆలోచనల్లోంచీ జారిపోయింది. అందుకు సుశీలకూ నవ్వే వచ్చింది.

ఓ శలవురోజు — కాలేజీ లేనిరోజున — కాంతని దగ్గర కూర్చోపెట్టుకుని - "చెల్లీ! నీ పెళ్లికి సంబంధాలు చూస్తున్నారమ్మా నాన్నగారు' అంది సుశీల.

కాంత సిగ్గుపడింది. తర్వాత నవ్వింది. "పో అక్కా-నాకు పెళ్లే వద్దు బాబూ' అంది.

ఆ మాటకి నివ్వెరపోయింది సుశీల. చేతిలో దువ్వెన అక్కడ పడేసి - చివ్వున చెల్లెల్ని తన వేపుకి తిప్పుకొని "ఈ మాట ఎవరితోనన్నా అన్నావా అమ్మా?" అనడిగింది ఆతృతగా. కాంత తెల్లబోయింది "లేదు, ఏం?'

"ఎవరితో అనకూడదమ్మా. కొందరు అదృష్టవంతులికే 'వొద్దు' అంటే "కావాలి" అని అర్థం. నీ లాంటి అమ్మాయిలకి వద్దు అంటే వద్దనే అర్థం. తెలిసిందా?"

"మరేం వర్రీలేదక్కా- జరిగేదేదో జరుగుతుంది. ఇంతకూ మనకు కావలసిన వాడు ఎక్కడో పుట్టే వుంటాడు."

నవ్వింది సుశీల. చదివోయిన పాత బామ్మల ఆలోచనలు బ్రతికివున్న కొత్త అమ్మాయిల్లో ప్రతిఫలిస్తున్నందుకు.

"అవునమ్మా పుట్టే వుంటాడు. కాని నేనే నీ కోసం పుట్టానని చెప్పడు. పెళ్ళయాక ఇతనే కాబోలు నా కోసం పుట్టాడని గుర్తుపట్టగలం. అంతకు ముందే గుర్తు పట్టాలనుకోవడం. పట్టబోవడం ప్రమాదం తల్లీ. పుటినవాడు రాకపోతాడా అని ఎదురు చూడటమూ ప్రమాదమే. అప్పుడతను పుట్టి, పెరిగి తప్పు త్రోవంట ప్రయాణంచేసే ప్రమాదం వుంది" గొప్ప వేదాంతిలాగ - అమ్మనీ బామ్మనీ, రాధనీ, నవ్వితే ముభావంగా కనిపించే పెళ్లి కొడుకునీ, గోపాలాన్నీ గుర్తు చేసుకొంటూ చెప్పింది సుశీల.

ఇదంతా వింటూంటే హఠాత్తుగా కాంతికి ఒక ఆలోచన తట్టింది.

"మరి నువ్వెందుకు పెళ్ళిచేసుకోలేదక్కా?"

సుశీల తుళ్ళిపడింది. దువ్వెన తీసుకొని జుత్తు చిక్కులు విప్పుతూ నవ్వింది.

"నీకు సలహా చెప్పడానికి సుశీలక్కయ్య ఉందమ్మా...నాకు అప్పట్లో హెచ్చరించే వాళ్ళెవ్వరూ లేకపోయారు. అందుకు" అందామనుకొంది!

కాని— "ఆఁ నా పెళ్ళికేం పోనిస్తూ" అంది ఎటువేపో చూస్తూ.

"ఈ జీవితానికింకా పెళ్ళి జరిగే అదృష్టమా?" అన్న నైరాశ్యం, తన పెళ్ళి మిద తనే శ్రద్ధ చూపలేదన్న పశ్చాత్తాపం ఆ మాటల్లో ధ్వనించింది. ●

